క్లుప్తంగా

గృహ నిర్మాణాలపై ఆర్డీవో సమీక్ష



తిరువూరు: పేదలకు పక్కాగృహాల మంజూరుపై తిరువూరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ, పంచాయతీరాజ్, హౌసింగ్, మున్సిపల్ అధికారులతో ఆర్డీవో మాధవి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు పక్కా గృహాల నిర్మాణానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆర్డీవో సూచించారు. ఈ పథకానికి సంబంధించిన విధివిధానాలు, నిర్మాణానికి అనుమతులు తదితర అంశాలపై చర్చించారు. తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు, తిరువూరు, విస్సన్నపేట తహసీల్దార్లు లక్ష్మి, లక్ష్మీకల్యాణి, మండల పరిషత్ అధికారులు, హౌసింగ్ ఏఈలు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

జి.కొండూరు: మండల పరిధి కోడూరు గ్రామంలో గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులపై అధికారులు సామాజిక తనిఖీ మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో జరిగిన ఎన్ఆర్ఈజీఎస్ పనులు, కూలీలకు అందిన వేతనాల రికార్డులను పరిశీలించారు. ఏపీఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కోడూరు గ్రామంలో గత ఆర్థిక సంవత్సరానికి కూలీలకు వేతనాల రూపంలో రూ.88.37 లక్షలు, మెటీరియల్‌కు రూ.7 వేలు ఖర్చు చేసినట్లు చెప్పారు.

నూజివీడు రూరల్ ఎస్ఐగా లక్ష్మణ్‌బాబు

నూజివీడు: నూజివీడు రూరల్ ఎస్ఐగా నల్లమల లక్ష్మణ్‌బాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఎస్ఐ మల్లికార్జునరెడ్డి వీఆర్‌కు వెళ్లగా ఆయన స్థానంలో ఏలూరు వన్‌టౌన్ ఎస్ఐగా పనిచేస్తున్న లక్ష్మణ్‌బాబును నూజివీడు రూరల్ ఎస్ఐగా నియమితులయ్యారు. 2012 బ్యాచ్‌కు చెందిన ఎస్ఐ కొన్నాళ్లు ఇంటిలిజెన్స్ ఎస్ఐగా పనిచేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో జూదాలు, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటానన్నారు.

ట్రాఫిక్ సమస్య లేకుండా సహకరించండి

సీఐ గిరిబాబు



తిరువూరు: పట్టణంలో ట్రాఫిక్ సమస్య లేకుండా ప్రైవేటు నర్సింగ్ హోంల నిర్వాహకులు సహకరించాలని సీఐ గిరిబాబు కోరారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ప్రైవేటు వైద్యులతో సమావేశం నిర్వహించారు. నర్సింగ్‌హోంల ఎదుట పార్కింగ్ ప్రదేశాన్ని తప్పక చూపాలని, ప్రభుత్వ స్థలాలు, రహదారి మార్జిన్లలో వాహనాలు నిలపవద్దని సీఐ సూచించారు. ట్రాఫిక్ సమస్య పెరుగుతున్నందున అన్ని ప్రైవేటు నర్సింగ్‌హోంలు తమ ప్రాంగణంలోనే వాహనాల పార్కింగ్‌కు స్థలం కేటాయించాలన్నారు. అన్ని ఆసుపత్రుల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. వైద్యులు తాళ్ళూరి రామకోటేశ్వరరావు, చంద్రశేఖరరెడ్డి, శ్రీనివాస బహదూర్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

132 మందికి వైద్య పరీక్షలు



ముసునూరు: నాలుగు గ్రామాల్లోని సచివాలయాల పరిధిలోని వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, ఫీవర్ సర్వేలు నిర్వహిస్తున్నట్లు ముసునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షకీనా ఇవాంజిలిన్ తెలిపారు. జ్వరాలు ఎక్కువగా ఉన్నాయని పీహెచ్‌సీ పరిధిలోని కొర్లగుంట, ముసునూరు, కాట్రేనిపాడు, చింతలవల్లి సచివాలయాల వద్ద మంగళవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, జ్వరాల సర్వేలు చేసినట్లు తెలిపారు. ఈ శిబిరాల్లో 132 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, ఏడుగురికి సాధారణ జ్వరాలు ఉన్నట్లు గుర్తించారు. వీరికి డెంగీ, మలేరియా టెస్ట్‌లు చేయగా నెగిటివ్ రిపోర్టులు వచ్చాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. వైద్య శిబిరాలను కొద్దిరోజులు కొనసాగిస్తామని డాక్టర్ షకీనా అన్నారు.

ఆగిరిపల్లి: చిన్నగిరిపల్లిలో మంగళవారం ఆగిరిపల్లి పీహెచ్‌సీ వైద్యులు జగన్ మోహన్‌రావు ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జ్వరాలు, అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టాలి



కరోనా సమయంలో ప్రజల ప్రాణాల రక్షణకు డాక్టర్లుగా మేం ఎంతో శ్రమకోర్చి పనిచేశాం. ప్రాణాలకు తెగించి ఎంతోమంది ప్రాణాలను కాపాడాం. అలాంటి డాక్టర్లపై దాడులు, అఘాయిత్యాలకు పాల్పడడం చాలా దారుణం. కోల్‌కతాలో డాక్టర్‌పై అత్యాచారం, హత్య సంఘటనను అందరూ ఖండించాలి. డాక్టర్లకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి. ఇందుకోసం అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.


–విజయలక్ష్మి, వైద్యాధికారి, పీహెచ్‌సీ, చాట్రాయి



దోషులను కఠినంగా శిక్షించాలి

వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడులు చేయడం దారుణం. నిరంతరం ప్రజారోగ్య పరిరక్షణ కోసం పనిచేసే వైద్యులను ఇబ్బందులకు గురిచేసే సంస్కృతి తగదు. కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం చేసి పాశవికంగా హత్య చేసిన నిందితులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలి. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

–మురళీకృష్ణ, పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్, ఏకొండూరు



పల్లెలను పీడిస్తున్న జ్వరాలు

- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- ఒళ్లు, కీళ్ల నొప్పులతో బాధితుల అవస్థలు
- పారిశుద్ధ్యాన్ని గాలికొదిలేయడమే కారణం



నూజివీడు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు

నూజివీడు: నియోజకవర్గంలో ఏ ఇల్లు చూసినా జ్వరపీడితులే కనిపిస్తున్నారు. ఇంటిలో ఒకరి తర్వాత ఒకరిని జ్వరం పట్టి పీడిస్తుంటే అందరూ మంచాన పడుతున్నారు. వైరల్ జ్వరాలు, చికెన్‌గున్యా, డెంగీ జ్వరాలు వేధిస్తున్నాయి. పేద, మధ్య తరగతి ప్రజలు జ్వరాలతో సతమతమవుతుండటంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఆర్ఎంపీల వద్దే వేలాది రూపాయలు ఖర్చవుతుండటంతో అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

సమస్యలు ఇవీ..

నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు పట్టణ ప్రజలు జ్వరాలతో మంచం పడుతున్నారు. తలనొప్పి, కళ్లు మంటలతో ప్రారంభమై విరేచనాలు, వాంతులు, ఒళ్లు నొప్పులతో జ్వర బాధితులు ఆసుపత్రులకు వస్తున్నారు. రెండు రోజుల పాటు ఉండి తగ్గిన తరువాత కీళ్ల నొప్పులు, ఒళ్లు నొప్పులతో పాటు పాదాల వాపు ఉండి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 20 నుంచి నెల రోజుల వరకు ఇవి పీడిస్తున్నాయి. వీటన్నింటికి తోడు నీరసం వేధిస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరికైతే ప్లేట్‌లెట్లు పడిపోతున్నాయి. అధికారులు స్పందించకపోవడంపై ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి.

కీళ్ల నొప్పులు, కాళ్ల వాపులతో..

గతంలో జ్వరం వస్తే రెండు, మూడు రోజులు ఉండి పోయేది. ప్రస్తుతం వస్తున్న జ్వరాలు వారం నుంచి పది రోజుల వరకు ఉండటమే కాకుండా కీళ్ల నొప్పులు, కాళ్ల వాపుతో జ్వరబాధితులు బాధపడుతున్నారు. చికెన్ గున్యానే కాకుండా డెంగీ కేసులు కూడా నమోదవుతున్నాయి. తలనొప్పి, వాంతులు, కళ్ల నొప్పులు విపరీతంగా ఉంటుండటంతో ఆసుపత్రులకు పరిగెడుతున్నారు. కీళ్ల నొప్పులు, ఒళ్లు నొప్పులతో యువత సైతం ఊతకర్ర సాయంతో ఇంట్లో నడవాల్సిన పరిస్థితి. అధికశాతం మందిలో డెంగీ లక్షణాలు సైతం కనిపిస్తున్నాయి. పట్టణ ప్రాంతాలకు చెందిన వారు ఏరియా ఆసుపత్రికి వెళ్తుండగా గ్రామీణ ప్రాంతాల వారు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.

ఫీవర్ సర్వే ఏది?

గత 20 రోజులకు పైగా ప్రజలు జ్వరాల బారిన పడి ఇబ్బందులు పడుతుంటే ఆర్ఎంపీలు జ్వర పీడితుల నుంచి చికిత్స పేరుతో వేలాది రూపాయలు పిండుతున్నారు. ప్రతి గ్రామంలో ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు ఉన్నా పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వంలో ప్రతి సీజన్‌లో ముందుగానే ఫీవర్ సర్వే చేసి జ్వర బాధితులను గుర్తించి వెంటనే వారికి చికిత్సను అందించేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో అవేమీ కనిపించడం లేదని ప్రజలు వాపోతున్నారు. ముసునూరు మండలంలోని పలు గ్రామాల్లో ఎంఎల్‌హెచ్‌పీలు ప్రజలకు అందుబాటులో ఉండటం లేదనే విమర్శలు వస్తున్నాయి. వైద్య శిబిరాలను నామమాత్రంగా నిర్వహిస్తున్నారు.

ఐదు రోజులుగా జ్వరం తగ్గడం లేదు



ఐదురోజులుగా జ్వరం తగ్గడం లేదు. రెండు రోజులుగా గ్రామంలోనే ఆర్ఎంపీ ఇచ్చిన మందులు వాడాను. వెయ్యి రూపాయలు ఖర్చు అయినా జ్వరం తగ్గలేదు. చేసేదిలేక ఏరియా ఆసుపత్రిలో చేరా. ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు, బాగా నీరసం ఉంది. నా భార్యకు కూడా జ్వరం వచ్చి తగ్గింది.

– మారుమూరి రాజు, తూర్పు దిగవల్లి, నూజివీడు మండలం

ఇప్పటికి రూ.5 వేలు ఖర్చు చేశా..



వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నా. ప్రైవేటు డాక్టర్ వద్ద చూపించుకుంటే రూ.5 వేలు ఖర్చయినా జ్వరం తగ్గడం లేదు. ఒళ్లు నొప్పులు, తలనొప్పి, కళ్ల నొప్పి, నీరసం తగ్గలేదు. ఇంటిలో భార్య, కుమారుడికి కూడా జ్వరం వచ్చి తగ్గింది. ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించాలి.

– దేవరపల్లి సునీల్, నూజివీడు

కాళ్ల నొప్పులతో నడవలేకపోయా..



ఐదు రోజుల నుంచి జ్వరం తగులుతోంది. రెండు రోజులు ఊళ్లోనే ఆర్ఎంపీ వద్ద చికిత్స చేయించుకున్నా తగ్గలేదు. దీంతో ఏరియా ఆసుపత్రికి వచ్చా. నా భర్తకు, పిల్లలకు వచ్చి తగ్గి, తరువాత నాకు వచ్చింది. కీళ్ల నొప్పులతో బిగుసుకుపోతున్నాయి. కదలిస్తే విపరీతమైన నొప్పి ఉంటోంది.

– కోపూరి కృష్ణవేణి, అన్నేరావుపేట, రెడ్డిగూడెం మండలం

13 రోజుల నుంచి..



జ్వరంతో 13 రోజుల నుంచి బాధపడుతున్నాను. గ్రామంలో ఆర్ఎంపీ వద్ద చూపించుకున్నా తగ్గలేదు. దీంతో ఏరియా ఆసుపత్రిలో చేరా. ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు, తల నొప్పి, కాళ్ల వాపులు రావడంతో పాటు నీరసంగా ఉంటోంది. ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం.

– భూక్యా మౌనిక, బత్తులవారిగూడెం, నూజివీడు మండలం

కాళ్ల వాపులతో ఇబ్బంది..



మా ఇంట్లో నలుగురికి జ్వరం వచ్చి తగ్గింది. నేను మూడు రోజులుగా జ్వరంతో ఇబ్బంది పడుతున్నా. జ్వరంతో పాటు కాళ్ల వాపులు, కీళ్ల నొప్పులు, ఒళ్లు నొప్పులు వస్తున్నాయి. కదలాలన్నా, నడవాలన్నా ఏమీ చేయలేకపోతున్నాను. ఇలాంటి జ్వరాన్ని ఎప్పుడూ చూడలేదు.

– గుడిమల్ల ఆశా, రేగుంట, నూజివీడు మండలం

టీడీపీ హయాంలోనే శివాలయం సొమ్ము స్వాహా

వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఆపాదిస్తూ ఈనాడు రోత రాతలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని శ్రీవిశ్వేశ్వర ఆలయానికి (శివాలయం) సంబంధించి జరిగిన అవకతవకలు నాటి టీడీపీ పాలనలోనేనని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. ఈ విషయంపై గ్రామంలో ఎవరిని అడిగినా చెబుతారని అంటున్నారు. దీనిపై మంగళవారం ఈనాడు దినపత్రికలో రాసిన రోత రాతలను చూసి గ్రామస్తులు మండిపడుతున్నారు. టీడీపీ హయాంలో జరిగిన నిర్వాకాన్ని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఆపాదించటం దుర్మార్గమని వ్యాఖ్యానిస్తున్నారు. వాస్తవానికి గొల్లపూడి గ్రామానికి చెందిన ఒకరు గ్రామంలో శ్రీవిశ్వేశ్వర ఆలయం (శివాలయం) నిర్మాణం కోసం 1.68 ఎకరాల (సర్వే నంబర్171/2లో) స్థలం దానం చేశారు. స్థల దాత మరణానంతరం దాత బంధువులమంటూ కారంపూడి వెంకటప్పయ్య, మంజుల తమ పేరు మీద రికార్డుల్లో మార్పించుకున్నారని గ్రామ పెద్దలు చెబుతున్నారు. దాత ఇచ్చిన స్థలంలో కొంత మేర విజయవాడ బైపాస్ రహదారికి సేకరించిన నేషనల్ హైవే సంస్థ పరిహారంగా రూ.1.11 కోట్లు విడుదల చేసింది. ఆ సొమ్ము వెంకటప్పయ్య,మంజుల జాయింట్ ఎకౌంట్‌లో జమకాగా కొంత డ్రా చేశారు. దాత ఇచ్చిన స్థలం దేవదాయ ధర్మాదాయ శాఖ కిందకు వస్తుందని,అతని బ్యాంక్ ఎకౌంట్‌లో ఎలా జమ చేస్తారని స్థానికులు ఫిర్యాదు చేశారు. దాంతో అప్పటి కలెక్టర్ బ్యాంక్ ఖాతాను సీజ్ చేశారు. రూ.1.11 కోట్లలో తీసుకున్న సొమ్మును తిరిగి జమ చేయాలని సబ్ కలెక్టర్ ఒత్తిడి చేసినా పట్టించుకోలేదు. ఇదంతా 2016లో (టీడీపీ పాలన) జరిగినా, ఈ తతంగం వెనుక స్థానిక టీడీపీ నాయకుల అండదండలతో నాటి వీఆర్‌ఓ ప్రసాద్ కథ నడిపాడన్నది బహిరంగ రహస్యమే అంటున్నారు గ్రామ స్తులు. ఇప్పుడు అధికారంలోకి రావడంతో ఆ పాపాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నమే ఈనాడు రోతరాతలని వ్యాఖ్యానిస్తున్నారు.

ఎమ్మెల్యేకు సమస్యల నివేదన

వినతిపత్రం అందజేసిన బీజేపీ నేతలు



తిరువూరు ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న బీజేపీ నాయకులు

తిరువూరు: పట్టణంలో పలు ప్రధాన సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నందున సత్వరచర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు బీజేపీ నాయకులు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. తిరువూరులోని ఆయన నివాసంలో కలిసిన బీజేపీ నేతలు రైతు బజారులో రైతులు తెచ్చిన కూరగాయలు కాకుండా దళారుల సరుకును స్టాల్స్‌కు సరఫరా చేస్తున్నారని, రైతుబజార్ స్టాల్స్‌లో అధికధరకు కూరగాయలు విక్రయిస్తున్నారని ఫిర్యాదు చేశారు. తిరువూరు ఆర్టీసీ బస్టాండు నుంచి బైపాస్‌రోడ్ సూర్యా రెస్టారెంట్ సెంటర్ వరకు ఉన్న రహదారి గోతులమయమై ప్రమాదాలు జరుగుతున్నందున అత్యవసర మరమ్మతులు చేయించాలని కోరారు. తిరువూరు నుంచి గతంలో నడిపిన ఆర్టీసీ బస్సు సర్వీసులలో ఏలూరు, శ్రీశైలం, భీమవరం, నాగార్జునసాగర్, విశాఖపట్నం, ద్వారకా తిరుమల, జగ్గయ్యపేట, కాకినాడ పట్టణాలకు రద్దయిన దూరప్రాంత సర్వీసులు పునరుద్ధరించాలని, రెవెన్యూ డివిజన్ కేంద్రమైన తిరువూరులో రవాణ శాఖ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. తిరువూరు పేట బాపయ్య కూరగాయల మార్కెట్‌లో మాంసం విక్రయ దుకాణాలతో ఇబ్బందికరంగా ఉన్నందున వాటిని వేరొకచోటికి తరలించాలని, తిరువూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పక్కన 12 సెంట్ల ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైనందున స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తిరువూరు రాజుపేట ఒకటో వార్డులో యథేచ్ఛగా గోవధ చేస్తున్నారని, బైపాస్‌రోడ్డులోని పలు రెస్టారెంట్లలో ఆవుమాంసంతో చేసిన ఆహార పదార్థాలు విక్రయిస్తున్నారని బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి దేవిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు నాళ్ళా సురేష్, మండల పార్టీ అధ్యక్షుడు బండి అచ్యుతరావు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తులను ఆదుకోవాలి



పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న నల్లగట్ల స్వామిదాసు

ఏ.కొండూరు: మండలంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ ఏ.కొండూరు నుంచి విజయవాడ కలెక్టరేట్ వరకు సీపీఐ ఆధ్వర్యంలో పాదయాత్రను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మంగళవారం ప్రారంభించారు. ఈ పాదయాత్ర ఏ.కొండూరు నుంచి ప్రారంభమై కృష్ణారావుపాలెం, చీమలపాడు, రామచంద్రాపురం మీదుగా మైలవరం వైపు కొనసాగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మండలంలో గిరిజన తండాల్లో కిడ్నీ వ్యాధిగ్రస్తులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కృష్ణాజలాలు వెంటనే సరఫరా చేయాలన్నారు. ఈ పాదయాత్రకు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, జెడ్పీటీసీ భూక్య గనియా పాల్గొని సంఘీభావం తెలిపారు. స్వామిదాసు మాట్లాడుతూ కిడ్నీ వ్యాధిగ్రస్తులకు వైద్యం అందిందేందుకు వైద్యులను నియమించాలన్నారు. గత ప్రభుత్వంలో డయాలసిస్ రోగులకు ప్రతి నెలా రూ.10 వేలు పింఛన అందించారన్నారు. సుమారు రూ.50 కోట్లతో కృష్ణాజలాలు పైప్‌లైన్ల ద్వారా అందించేందుకు నిధులు మంజూరు చేయించారని ఆ పనులు త్వరితగతిన పూర్తి చేసి కృష్ణాజలాలు అందించాలన్నారు. జిల్లా సీపీఐ కార్యదర్శి దోనేపూడి శంకర్, మండల కార్యదర్శి మేకల డేవిడ్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

అటవీ బంజరు భూములకు పట్టాలివ్వాలి



నూజివీడు ఎఫ్ఆర్ఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు, సాగుదారులు

నూజివీడు: 50 ఏళ్ల నుంచి అటవీ బంజర భూముల్లో సాగులో ఉంటున్న పేద, బలహీన వర్గాలకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ సీనియర్ నాయకుడు కొమ్మన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని అమరభవన్లో మంగళవారం అటవీభూముల సాగుదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పేదలు ఐదు దశాబ్దాలుగా అటవీ బంజరు భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, వీరిలో ఎక్కువశాతం మంది ఎస్సీ, ఎస్టీలు ఉన్నారన్నారు. మూడు తరాలు సాగులో ఉన్న భూములకు మాత్రమే పట్టాలు ఇవ్వాలనే చట్టాన్ని సవరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ భూములు మూడు తరాల నుంచి పేదల సాగులోనే ఉన్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పట్టాలు ఇవ్వాలన్నారు. సమావేశం అనంతరం నూజివీడు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌కు ఆక్రమణల తొలగింపు నోటీసులకు సమాధానాన్ని వినతిపత్రం రూపంలో అందజేశారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు, సీపీఐ నాయకులు చాట్ల పుల్లారావు, అటవీ బంజర భూముల సాగుదారులు పాల్గొన్నారు.

నేడు జిల్లా కలెక్టర్ పర్యటన

తిరువూరు: ఏకొండూరు మండలంలో బుధవారం జిల్లా కలెక్టర్ సృజన పర్యటిస్తారు. ఉదయం 10.30 గంటలకు కుదప వద్ద కృష్ణా నదీ జలాల సరఫరా నిమిత్తం నిర్మిస్తున్న వాటర్ ట్యాంకును పరిశీలిస్తారు. అనంతరం దీప్లా తండాలో పర్యటిస్తారు. తదుపరి 11.30 గంటలకు ఏకొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తారు.

1న బాల్ బ్యాడ్మింటన్ బాలబాలికల జట్ల ఎంపిక

నూజివీడు: ఉమ్మడి కృష్ణా జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చేనెల ఒకటో తేదీన నూజివీడులోని ఎం.ఆర్ అప్పారావు పీజీ కళాశాల క్రీడా ప్రాంగణంలో సబ్‌జూనియర్స్ బాల్‌బ్యాడ్మింటన్ బాల బాలికల జిల్లా జట్లను ఎంపిక చేయనున్నట్లు ప్రధాన కార్యదర్శి వీవీవీ ప్రసాద్ మంగళవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సెలెక్షన్స్ నిర్వహిస్తామని, ఇందులో పాల్గొనే క్రీడాకారులు 2009 జనవరి 2వ తేదీ తరువాత పుట్టిన వారికి మాత్రమే పాల్గొనే అవకాశం ఉందన్నారు. ఈ జిల్లా జట్టు ఎంపికకు వచ్చే క్రీడాకారులు ముందుగా వారి వివరాలను ఆర్ వేణుగోపాల్ సెల్ నంబర్ 94903 34333కు ఫోన్‌లో తెలిపి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్ 13 నుంచి 15 వరకు తూర్పుగోదావరి జిల్లా అన్నవరంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్స్ బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

నిందితులను అరెస్ట్ చేయాలి

ఆగిరిపల్లి: తిరువూరు మండలం, పెద్దవరంలో దళిత యువకుడిపై కుల దూషణకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని నూజివీడు నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి కాంచన రావు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ డేవిడ్ అనే దళిత యువకుడి ఇంటికి వచ్చి కులం పేరుతో దూషించి, చంపుతామని బెదిరించారన్నారు. వారిపై పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైనా ఇప్పటి వరకు అరెస్ట్ చేయలేదని ఆయన విమర్శించారు. వెంటనే అరెస్ట్ చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

కుక్కల దాడిలో 30 గొర్రెలు మృతి

చెన్నవరం(గంపలగూడెం): మండలంలోని చింతలనర్వ శివారు చెన్నవరంలో కుక్కలదాడికి 30 గొర్రెలు మంగళవారం మృతి చెందాయని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని ఓబుల వెంకటరామకృష్ణకు చెందిన షెడ్‌లో విజయవాడకు చెందిన తాతినేని శ్రీహరికి చెందిన 100 గొర్రెలు ఉన్నాయి. గొర్రెల షెడ్డులోకి నాలుగు కుక్కలు దూరి పది గొర్రెలను గాయపరిచాయి. ఈ సమయంలో గొర్రెలు బెదిరి కుప్పగా పడ్డాయి. దీంతో ఊపిరి ఆడక 30 గొర్రెలు మృత్యువాత పడ్డాయని, మరో 8 గొర్రెలు అస్వస్థతకు గురైనట్టు గ్రామస్తులు తెలిపారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో కొండపల్లి జెడ్పీ బాలికల పాఠశాల ప్లస్ విద్యార్థినులు ప్రతిభ చాటారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం బి.పద్మలత మంగళవారం ఈవివరాలను వెల్లడించారు. ఆమె మాట్లాడుతూ విజయవాడ బిషప్ అజరయ్య హైస్కూల్‌లో వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'కోఎడ్యుకేషన్‌లో లింగనిష్పత్తి' అంశంపై జిల్లా స్థాయిలో జరిగిన వ్యాసరచన పోటీల్లో 50 మంది విద్యార్థులు పాల్గొనగా జెడ్పీ పాఠశాలకు చెందిన బండి యశస్విని, మిర్యాల వెంకట మనస్విని ఉత్తమ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో మెడల్, ప్రశంసాపత్రం అందుకున్న బాలికలను ప్రశంసలతో ముంచెత్తారు. ఎస్ఎంసీ చైర్మన్ షేక్ బాజీబీ, ఉపాధ్యాయులు అభినందించారు.

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోండి



విద్యార్థికి స్కాలర్‌షిప్ అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

మైలవరం: దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎంఈవో ఎల్.బాలు తెలిపారు. మైలవరం ఎస్ఎస్‌కే హైస్కూల్ ప్రాంగణంలో మైలవరం ఓల్డ్ స్టూడెంట్స్ ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని 10వ తరగతిలో ప్రతిభ కనబర్చిన 16 మంది విద్యార్థినీ విద్యార్థులకు, 19 మంది అనాథ, దివ్యాంగ పిల్లలకు ఉపకార వేతనాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో బాలు మాట్లాడుతూ మోస్ట్ ద్వారా ఇటువంటి మంచి కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. ట్రస్టు చైర్మన్ చనమోలు వరప్రసాద్ మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా విద్య, వైద్య క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ట్రస్టు సలహాదారు కాటమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతంగా ఎదగడానికి ఈ స్కాలర్‌షిప్స్ సహాయ పడతాయన్నారు. వైస్ చైర్మన్ ఏ.విట్టల్‌బాబు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సెక్రటరీ అండ్ కోశాధికారి గూడూరు నాగిరెడ్డి ప్రసంగించారు. ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన వారికి స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నార్త్ సౌత్ ఫౌండేషన్, లకిరెడ్డి హనిమిరెడ్డి, కళాశాల చైర్మన్ లకిరెడ్డి ప్రసాదరెడ్డి సుమారు కోటి రూపాయలు విలువైన ఉపకార వేతనాలు అందజేశారని, మీరు కూడా బాగా చదువుకుని ఇంజినీరింగ్‌లో ఆ స్కాలర్‌షిప్‌లు పొందాలని ఆకాంక్షించారు. మాదాల బుల్లయ్య మెమోరియల్ జిల్లా పరిషత్ హైస్కూల్, జూనియర్ కళాశాలలో బైపీసీ చదువుతున్న విద్యార్థిని పఠాన్ సాజిదాకు రూ.10 వేలను కాటమనేని వెంకటేశ్వరరావు, చనమోలు వరప్రసాద్ అందజేశారు. ఏ.విఠల్‌బాబు, జూలకంటి ప్రసాద్, మన్నే శ్రీనివాసరావు, వి.సూర్యనారాయణ, గూడూరు నాగిరెడ్డి, చనమోలు రామారావు, తులసి, రవిబాబు, సురేష్‌బాబు పాల్గొన్నారు.

కోలాహలంగా ఉట్టి ఉత్సవం



నెమలి(గంపలగూడెం): నెమలి శ్రీవేణు గోపాలస్వామి ఆలయంలో స్వామి జన్మాష్టమి వేడుకల్లో భాగంగా మంగళవారం రాత్రి ఉట్టి ఉత్సవం కోలాహలంగా నిర్వహించారు. ముందుగా ఉట్టికి ఆలయ ప్రధాన అర్చకుడు తిరునగరి గోపాలాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఉట్టికి ఇరువైపులా భక్తులు చేరి రంగునీళ్లు చల్లుకొంటూ ఉత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉట్టి కొట్టిన అనంతరం కుండ పెంకులను భక్తులు తీసుకెళ్లారు. ఈ పెంకులు ఇంట్లో, దుకాణాల్లో ఉంచితే మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం.

నూజివీడు: ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహిస్తున్న శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా మంగళవారం పట్టణంలో శ్రీకృష్ణుడి ప్రతిమ ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. పట్టణ ప్రధాన వీధుల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శోభాయాత్ర చేశారు. భక్తుల కోలాటం, సన్నాయి వాయిద్యాలు, భగవద్గీత శ్లోక నినాదాలు, జయజయధ్వానాల మధ్య స్వామి వారి ఊరేగింపు కొనసాగింది. నిర్వాహకులు, నాయుడు, అంజిబాబు, రవి, జీవన్, లైలా, రవి, సుబ్బారావు, వీరాంజనేయులు పాల్గొన్నారు.

గ్రేడ్ 2 కార్యదర్శిగా నాగరాజ

చాట్రాయి: తుమ్మగూడెం గ్రామ పంచాయతీ గ్రేడ్–3 కార్యదర్శిగా పని చేస్తున్న నాగరాజు చనుబండ గ్రామ పంచాయతీ గ్రేడ్–2 కార్యదర్శిగా ఉద్యోన్నతిపై వెళ్లారు. మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఎంపీడీవో దుర్గాప్రసాదుకు నియామక పత్రం అందజేశారు.